నమస్తే తెలంగాణ
మహబూబాబాద్
5 | సోమవారం 25 మార్చి 2024 | MAHABUBABAD

## జూపార్కుకు త్వరలో పెద్దపులి



హనుమకొండ, మార్చి 24 : నగరంలోని జూపార్కులో త్వరలో పెద్దపులి సందడి చేయనుంది. ఈ మేరకు హంటర్‌రోడ్డులోని కాకతీయ జూపార్కులో అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం రూ. 60లక్షల వ్యయంతో ప్రత్యేకమైన ఎన్‌క్లోజర్ సిద్ధం చేస్తున్నారు. స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, చదును చేయనున్నారు. ఇప్పటికే ఇక్కడ ఉన్న షెడ్డుకు మరమ్మతులు చేసి నైట్ షెడ్‌గా మారుస్తున్నారు. పెద్దపులి స్వేచ్ఛగా తిరగడంతో పాటు నివాసయోగ్యంగా ఉండేందుకు అవసరమై న సౌకర్యాలు కల్పించనున్నారు. ఈ పని పూర్తయ్యేందుకు మరో మూడు నెలలు పట్టే అవకాశం ఉందని జూపార్కు ఇన్‌చార్జి మయూరి తెలిపారు.



దేవరుప్పుల మండలం ధరావత్ తండాలో ఎండిన పంట పొలాలను పరిశీలిస్తున్న హరీశ్‌రావు, కడియం శ్రీహరి, పెద్ది సుదర్శన్ రెడ్డి

# రైతుల కోసం మరో ఉద్యమం

### సమస్యల పరిష్కారానికి చలో సెక్రటేరియట్‌కు పిలుపునిస్తాం

**రైతులను మోసం చేసిన కాంగ్రెస్‌కు గుణపాఠం చెబుదాం**

**పార్లమెంట్ ఎన్నికలలోపు రైతుకిచ్చిన హామీలను అమలు చేయాలి**

**మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు**

దేవరుప్పుల, మార్చి 24 : కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకిచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు చేసిన పాపాన పోలేదు. యాసంగి దినం పంటలు ఎండుతుంటే మంత్రులు చోద్యం చూస్తున్నారు. నీళ్లుండీ ఇవ్వలేని దౌర్భాగ్య స్థితిలో ఈ ప్రభుత్వం ఉంది. రైతు సమస్యలు పరిష్కరించని పక్షంలో చలో సెక్రటేరియట్ పిలుపునిస్తాం' అని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. దేవరుప్పుల మండలం ధరావత్ తండా శివారు చింతబాయి తండాలో గిరిజన రైతులకు చెందిన వరి పంట పొలాలను ఆదివారం ఆయన పరిశీలించారు. మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆయన వెంట ఉన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఈ యాసంగిలో 20 లక్షల ఎకరాల్లో పంటలు ఎండగా, మరో లక్ష ఎకరాల్లో వడగండ్ల వానతో రైతులు పంట నష్టపోయారన్నారు. అప్పుల పాలైన 180 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. ఇంత జరుగుతున్నా నిమ్మకునీరెత్తినట్లు మంత్రులు ప్రతిపక్షనాయకుల ఇంటికి వెళ్లి రాజకీయాలు చేస్తున్నారు తప్ప, రైతుల ఇండ్లకు పోయి ఓదార్చాలన్న ధ్యాసే లేదన్నారు. ఇక్కడ రైతుల పరిస్థితి దయనీయంగా ఉందని, ఒక్కో రైతు సాగునీటి కోసం రూ.4లక్షలు ఖర్చు పెట్టి 5 నుంచి 6 బోర్లు వేయించినా నీళ్లు పడక పంటలు ఎండి, కన్నీళ్లు పెడుతున్నట్లు తెలిపారు. నీళ్లుండీ ఇవ్వలేకపోవడం కాంగ్రెస్ సర్కారు వైఫల్యమేనన్నారు. కాంగ్రెస్ పార్టీ గేట్లు తెరిచామని చెబుతున్న ముఖ్యమంత్రి, ప్రాజెక్ట్‌ల గేట్లు తెరిచి రైతులను ఆదుకుంటే మంచిదన్నారు. రైతులకిచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయని ఈ ప్రభుత్వానికి పార్లమెంటు ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలన్నారు. యాసంగిలో దెబ్బతిన్న పంటలకు ఎకరాకు రూ.25వేల నష్టపరిహారం చెల్లించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. వరి ధాన్యం క్వింటాలు కు రూ.500 బోనస్ చెల్లించాలన్నారు. ఎకరాకు రూ.15వేల రైతుబంధు చెల్లిస్తామని, గెలవగానే రూ.2 లక్షలు రుణమాఫీ చేస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి కనీసం పాత పద్ధతిన కూడా రైతుబంధు ఇవ్వలేదని రైతులే చెబుతున్నారని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల లోపు ఈ సమస్యలన్నీ పరిష్కరించపోతే బీఆర్ఎస్ పార్టీ చలో సెక్రటేరియట్‌కు పిలుపునిస్తామన్నారు. పింఛన్ల పెంపు, ప్రతి మహిళకు రూ.2500 ఇస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం మహా మోసానికి పాల్పడిందన్నారు.

#### బీఆర్ఎస్ పార్టీకి కేసీఆర్ అండ

దేవరుప్పుల మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడిన హరీశ్‌రావు కార్యకర్తలు అధైర్యపడనవసరం లేదని, కేసీఆర్ అండగా ఉంటారని అన్నారు. ఉద్యమ పార్టీగా మనకు జైలు కెళ్లడం కొత్తేమీ కాదని, సమస్యలపై పోరాడి ప్రజల పక్షాన నిలబడాలని పిలుపునిచ్చారు. ఎర్రబెల్లిని ఓడించిన ప్రతి ఓటరు ఇప్పటికే తాము చేసిన తప్పును తెలుసుకున్నారని, దేవరుప్పుల పర్యటనలో ఈ విషయం ప్రజల నుంచి విన్నట్లు తెలిపారు. ఎర్రబెల్లి మంత్రిగా ఉన్నన్ని రోజులు ఒక్క ఎకరం ఎండలేదని, ఎండాకాలంలో కాల్వల్లో నీరు పారిందని, చెరువులు నిండాయని, వాగులు పారాయని హరీశ్‌రావు తెలిపారు.



ధరావత్ తండాలో మహిళలతో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు



నిజాంపురంలో కామ దహనం నిర్వహిస్తున్న సభ్యులు

# హోలీ.. రంగోలి



**నేడు హోలీ పండుగ**

**ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పండుగ వాతావరణం**

**సహజసిద్ధమైన రంగులనే వాడాలంటున్న వైద్యులు**

కృష్ణకాలనీ, మార్చి 24 : ప్రకృతి అందాలకు కొత్తందం తీసుకొచ్చే వసంత రుతువు ప్రవేశించిన తర్వాత జరుపుకునే తొలి పండుగ హోలీ. రంగుల పండుగ వచ్చిందంటే ప్రతి ఒక్కరిలో ఉత్సాహం ఉరకలేస్తుంది. చిన్నా పెద్దా, ఊరువాడా ఏకమై రంగుల్లో తడిసిముద్దవుతారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకొని సంబురాల్లో మునిగితేలుతారు. హోలీకంటే ముందు కామదహనం చేస్తారు. హోలీ పండుగ ఈనాటిది కాదని, ద్వాపర యుగంలో శ్రీ కృష్ణపరమాత్ముడు జరుపుకున్నట్లు పురాణాలు చెబుతున్నాయి. హోలికా అనే రాక్షసి అంతమైన రోజును పురస్కరించుకొని ఉత్సవాలు జరుపుకునేవారు. వసంత మాసం ఆగమానికి గుర్తుగా వసంతకేళీ ఆడడం ఆనవాయితీగా వచ్చిందని మరికొందరు చెబుతారు. దేశం మొత్తం మీద హోలీ పండుగను వసంత మాసంలో వచ్చే హేలికా పౌర్ణమి నాడు ఘనంగా జరుపుకుంటారు. హోలీ వేడుకలకు ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు. వ్యాపారస్తులు తీరొక్క రంగులను అందుబాటులో ఉంచారు. కాగా, హోలీ పండుగకు సహజ సిద్ధమైన రంగులనే వాడాలని, రసాయనిక రంగులను వాడి ప్రాణాలమీదికి తెచ్చుకోవద్దని వైద్యులు సూచిస్తున్నారు.



వడ్డెకొత్తపల్లిలో సుధాకర్‌రావుకు నివాళులర్పిస్తున్న మాజీ మంత్రులు హరీశ్‌రావు, దయాకర్‌రావు, సత్యవతిరాథోడ్, ఎమ్మెల్యే శ్రీహరి తదితరులు

# డాక్టర్ సాబ్ సేవలు మరువలేనివి

**మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు**

**వడ్డేకొత్తపల్లిలో మాజీ ఎమ్మెల్యే సుధాకర్‌రావు సంస్మరణ సభ.. పాల్గొన్న ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు**

పెద్దవంగర, మార్చి 24: డాక్టర్ సాబ్ సేవలు మరువలేనివని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. మండలంలోని వడ్డెకొత్తపల్లి గ్రామంలో ఆదివారం మాజీ ఎమ్మెల్యే సుధాకర్‌రావు సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్‌రావు చిత్రపటం వద్ద మౌనం పాటించి నివాళులర్పించారు. ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జాటోత్ రామచంద్రూ నాయక్, యశస్వినీరెడ్డి, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతిరాథోడ్, కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి ఝాన్సీరెడ్డి, ఆయా మండలాల ఎంపీపీలు, జడ్పీటీసీలు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.






గ్యాస్ లీకేజీతో దగ్ధమైన ఇంట్లోని సామగ్రి



గూడెప్పాడ్‌లో గ్యాస్ లీకేజీతో అయిన ఇల్లు ఇదే..

## భార్యపై కోపంతో గ్యాస్ లీక్ చేసిన భర్త

**ఇంట్లో సామగ్రి దగ్ధం**

ఆత్మకూరు, మార్చి 24 : గూడెప్పాడ్ స్టేజీ వద్ద ఆదివారం ఓ వ్యక్తి తన భార్యతో గొడవ పడి గ్యాస్ లీక్ చేయడంతో ఇల్లు దగ్ధమైంది. స్థానికుల కథనం ప్రకారం.. గూడెప్పాడ్‌కు చెందిన మహ్మద్ అక్తర్ పాషాకు తన భార్య నసీమాతో రెండు రోజుల క్రితం గొడవ జరిగింది. ఇద్దరు పిల్లలతో కలిసి నసీమా తన తల్లిగారింటికి వెళ్లింది. దీంతో కోపంతో అక్తర్ ఇంట్లో ఉన్న వంట గ్యాస్ లీక్ చేసి బయటకు వెళ్లి పోయాడు. కాసేపటికి మంటలు చెలరేగి ఇంట్లో ఉన్న నిత్యావసర వస్తువులు, ఫ్రిడ్జ్, పూర్తిగా కాలిపోయాయి. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి తెలుపగా, ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు.



దేశాయిపేట నజ్రత్‌పురలోని స్కానింగ్ సెంటర్ వద్ద వైద్యురాలు, నర్సును అదుపులోకి తీసుకున్న పోలీసులు

# అంతా సెల్‌ఫోన్ ద్వారానే..

**రోజుకు 10 లింగనిర్ధారణ పరీక్షలు**

**గుట్టుచప్పుడు కాకుండా ఆటోల్లో తరలింపు**

**ఒక్కొక్కరి నుంచి రూ. 15 వేలు వసూలు**

**వరంగల్ 13వ డివిజన్ నజ్రత్‌పురలో దందా**

**పోలీసుల దాడితో బట్టబయలు**

పోచమ్మమైదాన్, మార్చి 24: లింగనిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం. ఇది ప్రభుత్వ, ప్రైవేట్ దవాఖానల్లో ఎటుచూసినా పెద్దపెద్ద అక్షరాలతో కనిపించే బోర్డులు. అయినా ఏదో ఒకచోట గుట్టుచప్పుడు కాకుండా పరీక్షలు చేస్తూనే ఉన్నారు. ఇందులో భాగంగా వరంగల్ దేశాయిపేటలోని నజ్రత్‌పురను ఎంచుకున్న కొంతమంది వైద్య సిబ్బంది ప్రభుత్వ అనుమతి లేకుండానే మూడు నెలల నుంచి లింగనిర్ధారణ పరీక్షలు చేస్తూ అక్రమ దందా కొనసాగిస్తున్నారు. తాజాగా శనివారం రాత్రి పోలీసులు దాడులు చేసి వారిని పట్టుకున్నారు. స్థానికుల కథనం ప్రకారం.. 13వ డివిజన్‌లోని నజ్రత్‌పుర ప్రాంతం అంటే అంతగా ఎవరికీ తెలియదు. ఇక్కడ నామమాత్రంగా ఉన్న ఇండ్లల్లో తక్కువ జనాభా ఉంది. చాలా మంది పేదలు ఉన్న ఈ ప్రాంతాన్ని ఎంచుకున్న కొంత మంది వైద్య సిబ్బంది ఎవరికీ అనుమానం రాకుండా లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. హంటర్ రోడ్డుకు చెందిన ఓ డాక్టర్, కాశీబుగ్గకు చెందిన ఓ నర్సుతోపాటు మరికొంతమంది సిబ్బంది ఈ దందాకు శ్రీకారం చుట్టారు. ఈ ప్రాంతంలో అద్దెకు తీసుకున్న గదిలో ఏం జరుగుతుందో కూడా స్థానికులకు తెలియకుండా జాగ్రత్తపడ్డారు. మొబైల్ స్కానింగ్ మిషన్ మాత్రమే తీసుకొచ్చి గుట్టుచప్పుడు కాకుండా పరీక్షలు చేస్తున్నారు.

**ఆటోల్లో తీసుకొచ్చి..**

నజ్రత్‌పురలోని ఓ ఇరుకుగదిలో ఏర్పాటు చేసిన స్కానింగ్ సెంటర్ ఎవరికీ సరిగా కనిపించదు. సెల్‌ఫోన్లతో కాల్ చేసి ఆటోల్లో తీసుకొచ్చి లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. హనుమకొండలో ఓ కాల్ సెంటర్ ఏర్పాటు చేసుకుని, ఈ కేంద్రానికి వారిని తరలిస్తున్నట్లు తెలుస్తున్నది. వీరిని తీసుకొచ్చేందుకు ఆటో డ్రైవర్‌కు రోజుకు రూ. 3 వేలు ఇస్తున్నట్లు తెలిసింది. నిత్యం కనీసం పది మందికి లింగనిర్ధారణ పరీక్షలు చేస్తూ ఒక్కొక్కరి నుంచి రూ. 15 వేలు వసూలు చేస్తున్నట్లు సమాచారం.

#### పక్కా సమాచారంతో దాడులు..

నజ్రత్‌పురలో కొనసాగుతున్న లింగనిర్ధారణ పరీక్షల వ్యవహారం గుర్తుతెలియని వ్యక్తుల నుంచి పోలీసులకు సమాచారం వెళ్లింది. దీంతో పోలీసులు ఆకస్మికంగా దాడులు నిర్వహించి, మొబైల్ స్కానింగ్ మిషన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అలాగే, పరీక్షలు చేస్తున్న వైద్యురాలితోపాటు నర్సును అదుపులో తీసుకున్నారు. సమాచారం తెలుసుకున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సైతం ఈ ప్రాంతాన్ని సందర్శించారు. వైద్యురాలితోపాటు నర్సుపై ఇంతెజార్‌గంజ్ పోలీసులు కేసు నమోదు చేశారు.

## నేటి నుంచి పలు రైళ్ల రద్దు

కాజీపేట, మార్చి 24 : కాజీపేట మీదుగా నడిచే పలు రైళ్లను ఈ నెల 25 నుంచి ఏప్రిల్ 21వ తేదీ వరకు రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. బల్లార్షా, విజయవాడ, భద్రాచలం రోడ్డు, సికింద్రాబాద్ సెక్షన్‌లో జరుగుతున్న రోలింగ్ కారిడార్ రైల్వే బ్లాక్ వర్క్స్ వల్ల ఆరు రైళ్లను రద్దు చేశారు. కాజీపేట-బల్లార్షా-కాజీపేట మధ్య నడిచే (17035/17036) అజ్నీ ప్యాసింజర్ రైలు, భద్రాచలం రోడ్డు-విజయవాడ- భద్రాచలం రోడ్డు మధ్య నడిచే (07278/07279) ప్యాసింజర్ రైలు, సికింద్రాబాద్- వరంగల్, వరంగల్-హైదరాబాద్ (07462/07463) మధ్య నడిచే పుష్‌పుల్ రైలును రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ప్రయాణికులు గమనించాలని రైల్వే అధికారులు కోరారు.

**సమస్యలు పరిష్కరించకపోతే**

## స్పాట్ బహిష్కరిస్తాం

**డీఐఈవో గోపాల్‌కు ప్రైవేట్ లెక్చరర్ల వినతి**

హనుమకొండ చౌరస్తా, మార్చి 24: ఇంటర్ పేపర్ వ్యాల్యూయేషన్ క్యాంపులో ప్రైవేట్ లెక్చరర్ల సమస్యలు వెంటనే పరిష్కరించకపోతే గురువారం స్పాట్‌ను బహిష్కరిస్తామని పేర్కొన్నారు. ఈ మేరకు డీఐఈవో గోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. గత ఏడాది 20 శాతం కట్ చేసిన అమౌంట్ వెంటనే చెల్లించాలని, ఈ సంవత్సరం కూడా వ్యాల్యూయేషన్ అయిన వెంటనే డబ్బులు జమ చేయాలని డిమాండ్ చేశారు.

## లక్నవరంలో పర్యాటకుల సందడి

గోవిందరావుపేట, మార్చి 24 : మండలంలోని లక్నవరంలో పర్యాటకులు సందడి చేశారు. ఆదివారం సెలవు దినం కావడంతో సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చారు. వేలాడే వంతెనలపై నడుస్తూ బోటింగ్ పాయింట్‌కు చేరుకొని సరస్సులో షికారు చేశారు. లక్నవరం అందాలకు వారు ఫిదా అయ్యారు.



లక్నవరంలో స్పీడ్ బోటింగ్ చేస్తున్న పర్యాటకులు




